సచివాలయ సేవలకు మంగళం

- కొత్త రేషన్ కార్డులు, పింఛన్ల మంజూరుపై ప్రశ్నిస్తున్న ప్రజలు
- సర్వేల పేరుతో ఇంటింటికి సచివాలయ ఉద్యోగులు



ఎర్రబల్లెలో తెరుచుకోని గ్రామ సచివాలయం

పులివెందుల రూరల్ : అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లోని ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందించే విధంగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. అయితే 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సచివాలయ సేవలకు మంగళం పాడింది. దీంతో పట్టణాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో కొత్తరేషన్ కార్డుల కోసం పింఛన్ల మంజూరుపై సచివాలయ ఉద్యోగులను ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందించాల్సిన 550 రకాల సేవలను కూటమి ప్రభుత్వం దెబ్బతీస్తోంది. ఈ ప్రభుత్వం తీరుతో ఉద్యోగులు, అటు ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. అప్పటి నుంచి ప్రజల ముంగిటి వద్దకే ప్రభుత్వ సేవలు అందించే విధంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు లబ్ధి చేకూర్చేవారన్నారు.

వెలవెలబోతున్న గ్రామ, వార్డు సచివాలయాలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయాలు గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రజలతో కళకళలాడుతూ ఉండేవి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలవుతున్నప్పటికీ సచివాలయంలో సేవలు సక్రమంగా జరగడంలేదు. దీంతో ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు మండల కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. అక్కడ పరిష్కారం కాకపోవడంతో ఆర్డీఓల కేంద్రాలకు వెళ్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో సైతం సచివాలయాలలో ప్రజలులేక వెలవెలబోతున్నాయి.

సర్వేలతో సచివాలయ ఉద్యోగుల కుస్తీ

గత ప్రభుత్వంలో వలంటీర్లతో సర్వేలు చేయించడాన్ని తప్పు పట్టిన అప్పటి ప్రతిపక్షనేత చంద్రబాబు తాను అధికారంలోకి వచ్చాక ఏకంగా సచివాలయ ఉద్యోగులను సర్వేల పేరుతో నిరంతరం వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పులివెందుల నియోజకవర్గంలో సచివాలయ ఉద్యోగులు ఇంటింటా సర్వేలతో కుస్తీలు పడుతున్నారు. తమకు కనీస గౌరవం కూడా లేకుండాపోయిందని సచివాలయ ఉద్యోగుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త రేషన్ కార్డులు ఎప్పుడిస్తారో..

సచివాలయ ఉద్యోగులను రేషన్ కార్డులు, పింఛన్ల గురించి అడిగినా సరైన సమాధానం చెప్పడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వం ఇంకా వైద్యం ఓపెన్ చేయలేదని చెబుతున్న పరిస్థితి కూటమి ప్రభుత్వంలో నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఒక దరఖాస్తు కూడా స్వీకరించలేదని ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు అంటున్నారు.

ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందించాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉన్నప్పుడు ప్రభుత్వ సేవలను ఇంటి వద్దకే అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టాలి.

– జగన్, మెకానిక్, పులివెందుల

ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలిగించకుండా ఉండాలన్న లక్ష్యంతో ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందించే విధంగా గ్రామీణ ప్రాంతాల్లోనూ, పట్టణాల్లోనూ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలల్లోనే సచివాలయ వ్యవస్థలోని వలంటీర్ల వ్యవస్థను తొలగించారు. దీంతో ప్రజల వద్దకే అందాల్సిన సేవలు అందకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– శ్రీనివాసరెడ్డి, స్థానికుడు, పులివెందుల

క్లుప్తంగా

రేపు ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం మధ్యాహ్నం నుంచి కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. అలాగే ఆసుపత్రిలో నూతనంగా డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందని, కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

వైభవంగా సత్యసాయిబాబా రథోత్సవం



వేంపల్లె : పుట్టపర్తి సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 23వ తేదీ భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 100వ జన్మదినోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. సత్యసాయి బాబా 100వ జయంతి ఉత్సవాల్లో భాగంగా దేశ వ్యాప్తంగా సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వేంపల్లె పట్టణంలో గండి రోడ్డు నుండి షిర్డీ సాయిబాబా మందిరం వరకు రథోత్సవం నిర్వహించారు. మహిళలు పట్టణ పురవీధుల్లో హారతులు పట్టారు. కార్యక్రమంలో సత్యసాయిబాబా సేవా సమితి జిల్లా అధ్యక్షుడు శరత్‌బాబు, వేంపల్లె కన్వీనర్ సాయినాథ్, సమితి సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పులివెందుల రూరల్ : పులివెందులలోని ఉలిమెల్ల, నల్లపురెడ్డిపల్లె, కదిరి రోడ్డు 33/11 కె.వి. విద్యుత్ సబ్‌స్టేషన్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ రమేష్ తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

ఘనంగా గోమాతల గ్రామోత్సవం


గోమాతలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో శుక్రవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో గోమాతల గ్రామోత్సవం ఘనంగా జరిగింది. వర్షాలు పడకపోవడంతో గోమాతలకు పూజ చేస్తే వర్షాలు పడతాయన్న నమ్మకంతో గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి పులివెందులకు వెళ్లే దారిలో ఉన్న శివాలయం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అడు గడుగునా గోమాతలకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

ప్లాన్ ప్రకారమే నిర్మాణ పనులు చేపట్టాలి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రాముడు

పులివెందుల టౌన్ : భవన యజమానులు ప్లాన్ ప్రకారమే ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ హాలులో టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం భవన నిర్మాణ అనుమతుల మంజూరుకు ప్రభుత్వం మార్గదర్శకాల గురించి స్వీయ ధృవీకరణ పథకం ద్వారా అతి సులువుగా ఇంటి నిర్మాణాల అనుమతులు పొందవచ్చునన్నారు. అనుమతి లేని లేఔట్లలో ప్రజలెవరూ ప్లాట్లు కొనవద్దని, అలా కొన్న ప్లాట్లకు ఇంటి నిర్మాణ అనుమతులు మంజూరు కావన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది, బిల్డర్లు, ఎల్‌టీపీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అసౌకర్యం కలగకూడదు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అధికారులకు, సిబ్బందికి ఆదేశాలిచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన వసతి గృహాలను, మెస్సును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

నేడు ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ

పులివెందుల టౌన్ : పట్టణంలో శనివారం ఉదయం ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగే ఈ ర్యాలీ పూలంగళ్ల సర్కిల్‌లో ప్రారంభమై పాత బస్టాండు మీదుగా వైఎస్సార్ సర్కిల్ వరకు చేరుకుంటుందన్నారు. ఈ ర్యాలీలో పుర ప్రముఖులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బెల్టు షాపుల నిర్వాహకుల అరెస్టు


బెల్టు షాపుల నిర్వాహకుడిని అరెస్టు చేసిన ఎస్‌ఐ రవికుమార్

సింహాద్రిపురం : మండలంలోని హిమకుంట్ల, కోవరంగుంటపల్లె గ్రామాలలో బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే పోలీసులకు తెలపాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. అసాంఘిక కార్యకలాపాలను తెలిపితే వాటిపై ఉక్కుపాదం మోపి అణిచివేసి, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

శాకంబరిదేవి అలంకరణలో వాసవీమాత



వేంపల్లె : స్థానిక మైయిన్ బజార్‌లోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో వాసవీమాత శాకంబరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం కన్యకాపరమేశ్వరి ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ నేతృత్వంలో వాసవీమాతకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన, నివేదన, మంత్ర పుష్పం, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కర్ణాటక నుంచి ప్రత్యేకంగా తెప్పించిన పండ్లు, కూరగాయలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి దర్శనభాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్, యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు, మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగ్యేశ్వరమ్మ, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్లు


రోడ్డుకు అడ్డుగా పడిన చెట్లను తొలగిస్తున్న పోలీసులు

వల్లూరు : మండల పరిధిలోని సత్యా గ్రీన్ సిటీ సమీపంలో రెండు చెట్లు విరిగి రోడ్డుకు అడ్డుగా పడిపోవడంతో వాహనాల రాకపోకలకు కొంత ఇబ్బందులు తలెత్తాయి. శుక్రవారం తెల్లవారుజామున బలమైన గాలులు వీచడంతో హైవే పక్కన వున్న రెండు చెట్లు విరిగి రోడ్డుకు అడ్డుగా పడిపోయాయి. చెట్టు విరిగి పడిన విషయాన్ని గమనించక పోవడంతో తెల్లవారుజామున కమలాపురం వైపు నుంచి కడపకు వెళుతున్న ఒక ఆటో స్వల్పంగా దెబ్బతిన్నట్లు తెలెస్తోంది. సమాచారం అందుకున్న వల్లూరు పోలీసులు ఉదయాన్నే అక్కడికి చేరుకుని రోడ్డుకు అడ్డుగా వున్న చెట్లను తొలగించడానికి చర్యలు చేపట్టారు.

పులివెందులపై చూపిన అయిష్టతతోనే..


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల : ఆనాడు చంద్రబాబు నాయుడు పులివెందుల ప్రాంతంపై చూపిన అయిష్టత, చులకన భావం చూసి టీడీపీలో ఆత్మాభిమానం చంపుకోలేక సతీష్‌రెడ్డి ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటూ రాష్ట్ర స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న నాయకుడు సతీష్‌రెడ్డి అన్నారు. కేవలం కొద్ది రోజులు ఓపిక పడితే ఎవరి స్థాయి ఏంటో ఈ సారి ప్రజలే నిర్ణయిస్తారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో పాడా నిధులతో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ప్రతి ఎకరాకు సాగు నీరు అందించారన్నారు. గత ప్రభుత్వంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి చెరువులు పూర్తిగా ఎండిపోయిన పరిస్థితి నెలకొనలేదని, చిత్తశుద్ధి ఉంటే వెంటనే రైతులకు న్యాయం చేయాలన్నారు. ఇకపోతే కేవలం వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులుగా ఉంటూ గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసినందుకు సామాన్య జనాన్ని అక్రమంగా హత్యాయత్నం కేసులో ఇరికించాలని చూసి కోర్టు చీవాట్లు పెట్టేసరికి ఇప్పుడు అదే ప్రజలకు కంటి తుడుపు మాటలు చెబుతున్నారన్నారు. రాంగోపాల్‌రెడ్డి, కూటమి నాయకులు ఈరోజు రాయలసీమ ప్రాంతంలో నిరుద్యోగులకు తక్షణమే నిరుద్యోగ భృతి వచ్చేలా చేయాలన్నారు. పులివెందుల నుంచి ఎన్నికైన మీరు పులివెందుల ప్రాంతంలో ఉన్న వైద్య కళాశాల సీట్లు భర్తీ చేయించాలన్నారు. కూటమి ప్రభుత్వంలో కొన్ని నెలలుగా జీతాలురాక ఇబ్బందులు పడుతున్న మెడికల్ కళాశాల ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు తక్షణమే చెల్లించాలన్నారు. ఇంటర్ విద్యార్థిని హత్యకుగురైతే దాన్ని ఛేదించి నిందితులను అరెస్ట్ చేయలేకపోతున్న ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి తక్షణమే కేసు ఛేదించేలా చూడాలని వారు డిమాండ్ చేశారు. కూటమి నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులపై విమర్శలు మానుకుని ప్రజా సమస్యలపై, పులివెందుల అభివృద్ధికి ఒక్క పైసా కూడా ఇవ్వకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వంపై ప్రజల తరుపున పోరాడితే బాగుంటుందని హితవు పలికారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిశోర్, కో ఆప్షన్ చంద్రమౌళి, బీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్, నియోజకవర్గ బీసీ విభాగం అధ్యక్షుడు కార్తీక్, చక్రాయపేట యువజన విభాగం నాయకుడు రామాంజనేయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న సీఐ నరసింహులు

వేంపల్లె : చెడు అలవాట్లకు ప్రతి విద్యార్థి దూరంగా ఉండాలని సీఐ నరసింహులు తెలిపారు. శుక్రవారం వేంపల్లెలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్, ట్రాఫిక్, సైబర్ క్రైమ్ వాటిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించాలంటే క్రమ శిక్షణ అనేది ఉండాలన్నారు. చెడు అలవాట్లకు లోనైతే భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. చెడు అలవాట్లకు బానిస కాకుండా ప్రతి రోజూ పాఠశాలకు వచ్చి శ్రద్ధగా చదువుకోవాలన్నారు. చిన్న పిల్లలు మోటర్ బైకులు నడిపి ట్రాఫిక్‌కు అంతరాయం కల్పించొద్దన్నారు. ప్రమాదాలు జరిగితే నష్ట పోయేది మీరేనన్నారు. సెల్ ఫోన్ ద్వారా చాలా వ్యసనాలకు గురవుతున్నారని, సెల్ ఫోన్ జోలికి పోరాదన్నారు. చదువుతోపాటు క్రీడల్లో కూడా విద్యార్థులు పాల్గొనాలన్నారు. వ్యసనాలకు బానిస కావడంవలన సైబర్ క్రైంలకు పాల్పడుతున్నారని, వాటి జోలికి కూడా వెళ్లరాదన్నారు. బాల్యం నుండే మంచి క్రమశిక్షణ ఉంటే మంచిస్థాయిలో ఉండే అవకాశం ఉంటుందన్నారు. అయా హోదాలో ఉన్న అధికారులను, క్రీడాకారులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నారాయణమ్మ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నలుగురికి ఒక్కరే..


న్యూస్ పేపర్ చదువుతూ కాలక్షేపం చేస్తున్న ఉపాధ్యాయుడు

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామ సమీపంలోని సుగాలి తాండాలో ఉన ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాలలో నలుగురు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారు. ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉన్నప్పటికీ పాఠశాలను అలాగే నడుపుతున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో విద్యాశాఖ అధికారులు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అయినప్పటికీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. దీంతో పాఠశాల ఉపాధ్యాయుడిని వివరణ కోరగా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు మాత్రమే పాఠశాలకు వస్తున్నారన్నారు. ఆయన కూడా పిల్లలకు చదువు చెప్పకుండా న్యూస్ పేపర్ చదువుతూ కాలక్షేపం చేస్తున్నాడు.

పాఠశాల వద్ద చెత్త ట్రాక్టర్లను తొలగించండి

వేంపల్లె : వేంపల్లెలోని స్థానిక ఉర్దూ ఉన్నత పాఠశాల సమీపంలో పార్కింగ్ చేస్తున్న చెత్త ట్రాక్టర్లను అక్కడ నుంచి తొలగించాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కో ఆర్డినేటర్ రహమతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాపీర్‌లు కోరారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉన్న పంచాయతీ కార్యదర్శి మాధవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. పాత మార్కెట్‌లో రెండు ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలు ఉన్నాయని, అ పాఠశాలల వద్ద గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్లు పార్కింగ్ చేయడంవలన విద్యార్థులకు ఇబ్బందిగా మారిందన్నారు. చెత్త ట్రాక్టర్లు నిలపడం ద్వారా విద్యార్థులకు దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు కూడా ఎక్కువ కావడంతో పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు రోగాలబారిన పడుతున్నారన్నారు. చెత్త ట్రాక్టర్లు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రెయినేజీ కాలువలను మట్టితో పూడ్చి వేశారని కాలువలను శుభ్రం చేసి మురికి నీరు కాలువల్లో పోయే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వీధులలో కుక్కలు అధికంగా ఉన్నాయని, వాటిపై కూడా దృష్టి పెట్టాలన్నారు.

మత్తు రహిత సమాజాన్ని నిర్మిద్దాం


మాట్లాడుతున్న అర్బన్ సీఐ చాంద్‌బాషా

పులివెందుల టౌన్ : మత్తు రహిత సమాజాన్ని నిర్మిద్దామని అర్బన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అధ్యక్షతన స్నేహిత అమృతహస్తం సేవా సమితి, ఎన్‌ఎస్‌ఎస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అర్బన్ సీఐ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో స్నేహం మాటున యువత సరదాగా మత్తు అలవాటుతో భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందన్నారు. డాక్టర్ సుకన్య మాట్లాడుతూ కొంతమంది యువతులు మత్తు పదార్థాల అలవాటు కారణంగా రేపటి తల్లులు అయ్యే సమయంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాల నారాయణ, ప్రముఖ వ్యాఖ్యాత రోటేరియన్ నాగేశ్వరరెడ్డి, ఉమెన్స్ సెల్ కో ఆర్డినేటర్ విజయలక్ష్మి, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ లిఖిత, సృజన, సేవా సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంరక్షణపై అవగాహన సదస్సు

చింతకొమ్మదిన్నె : రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం రిటైర్డ్ స్పెషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.మంగళ గౌరీ, న్యాయవాది కాంచనలు మహిళా సంరక్షణపై కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుధాకరరెడ్డి తెలిపారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు ధైర్యంగా ముందుకు సాగాలని, మన చుట్టూ ఉన్నవాళ్లకి సమస్య వచ్చిన వెంటనే వాళ్లే స్పందించాలని కాదు, ఎవరైనా స్పందించి కంప్లైంట్ ఇవ్వవచ్చునన్నారు. వరకట్న వేధింపుల వ్యతిరేక చట్టం 498–ఏ గురించి తెలుపుతూ అదనపు కట్నం కోసం వేధించిన వారిని శిక్షించాలని తెలియజేస్తూ వివిధ రకాల సెక్షన్ల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల మహిళా సంరక్షణ కో ఆర్డినేటర్ శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్కూల్ తనిఖీ

కడప కార్పొరేషన్: కడప నగరంలోని ఆగాడి స్ట్రీట్‌లో ఉన్న మున్సిపల్ ఉర్దూ హై స్కూల్‌ను ప్రభుత్వ విప్,కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి తనిఖీ చేశారు. ఇటీవల ప్రజాదర్బార్‌లో తనకు వచ్చిన ఫిర్యాదులపై ఆమె శుక్రవారం ఆ పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లి దండ్రులతో మాట్లాడారు. అక్కడున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట డీఈఓ షంషుద్దీన్ పాల్గొన్నారు.

యూనియన్‌ల మధ్య గొడవ


వివాదానికి కారణమైన క్వార్టర్

జమ్మలమడుగు : ఆర్టీపీపీలో ఉద్యోగులకు కేటాయించే క్వార్టర్స్‌పై ఉద్యోగ సంఘాల గొడవలు ప్రారంభమయ్యాయి. క్వార్టర్ కేటాయింపులో సీనియారిటీ తీసుకోలేదంటూ రెండు యూనియన్‌ల నాయకులు సివిల్ ఎస్‌ఈ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ఏఎఫ్–16 క్వార్టర్స్ సీనియారిటీలేని వ్యక్తులకు కేటాయంచడం జరిగిందంటూ ఒక యూనియన్ ఆరోపణలు చేయడంతో మరోయూనియన్ అన్ని సక్రమంగా జరిగాయంటూ వాదనకు దిగారు. రెండు యూనియన్ నాయకులు, కార్మికులు ఎస్‌ఈ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అయితే అధికారులు విచారణ చేసిన తర్వాత గదుల కేటాయింపు జరుగుతుందని వివరించి కేటాయించిన క్వార్టర్స్‌ను రద్దు చేశారు. విచారణ జరిగితే సీనియారిటీ జాబితా ఉన్న వారికి పూర్తి న్యాయం జరుగుతుందని కార్మిక సంఘాలు పేర్కొంటున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


మురికి కాలువలో అబేట్ మందును పిచికారి చేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది


జమ్మలమడుగులో డ్రైడే పాటించాలని ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

సింహాద్రిపురం : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని కోవరంగుంటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని లోమడ గ్రామంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది దోమల నివారణకు మురికి కాలువల్లో, ఇళ్లలోని నీటి తొట్లలో అబేట్ మందును పిచికారి చేశారు. ఈ సందర్భంగా సిద్ధయ్య మాట్లాడుతూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే దోమల వ్యాప్తిని అడ్డుకోవచ్చునన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే – డ్రైడేగా పాటించి నీటి నిల్వలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఖాదర్ బాషా, హెల్త్ సూపర్‌వైజర్ ఖలీల్ బాషా, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్న, ఎంఎల్‌హెచ్‌పీ రెడ్డమ్మ, ఆశా కార్యకర్త గంగా భవాని, ప్రజలు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : ప్రజలు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు తెలిపారు. శుక్రవారం ఎర్రగుంట్ల మండలంలో క్రాంతినగర్‌లో ప్రజలు మలేరియా, డెంగీ బారిన పడకుండా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇంట్లో ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచితే దోమలు ఎక్కువగా పెరిగిపోయే అవకాశం ఉందన్నారు. పిల్లలకు స్కూల్‌లకు పంపిచే తల్లిదండ్రులు కాచి చల్లార్చిన నీటిని బాటిల్స్‌లో వేసి ఇవ్వాలని సూచించారు. ప్రజలకు జ్వరం వస్తే వెంటనే ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించాలని ఎక్కువ రోజులు జ్వరం వస్తుంటే వారికి రక్త పరీక్షలు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

వేంపల్లె : స్థానిక శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో ఈనెల 20వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. తిరుపతి శ్రీరమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో కీళ్లు, ఎముకలు, నరాలు, ఊపిరితిత్తులు, చెవి, ముక్కు, టైఫాయిడ్, మలేరియా, స్త్రీ సంబంధిత వ్యాధులు, యురాలజీ తదితర సంబంధిత ఆరోగ్య సమస్యలపై ఉచితంగా వైద్య సేవలు అందిస్తారన్నారు. రక్తదాన శిబిరం తలసీమియా పీడిత చిన్నారులు, ప్రమాద బాధితులు, క్యాన్సర్, డయాలసిస్ పేషెంట్లకు ఉపయోగ పడే విధంగా ఈ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. అలాగే తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారన్నారు. మరిన్ని వివరాలకు 9494577620, 9502485242 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.